ప్రజాశక్తి

ఆదివారం 4 ఫిబ్రవరి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

'రియల్' కారణాలేనా..?



హత్యకు కొద్ది గంటల ముందు విజయనగరం జిల్లా బొండపల్లి తహశీల్దారుగా బాధ్యతలు చేపడుతూ రమణయ్య

- తహశీల్దార్ రమణయ్య హత్యతో ఉలిక్కిపడ్డ విశాఖ
- రెవెన్యూ ఉద్యోగుల్లో కలవరపాటు
- నిందితున్ని కఠినంగా శిక్షించాలంటూ ఎక్కడికక్కడ నిరసనలు

ప్రజాశక్తి - మధురవాడ, ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

విశాఖలోని చినగదిలి మండల తహశీల్దారుగా పనిచేసి ఇటీవలే విజయనగరం జిల్లా బొండపల్లి మండలానికి బదిలీ అయిన సనపల రమణయ్య పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్యకు గురవడంతో విశాఖ, విజయనగరం జిల్లాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. తమ భద్రతపై రెవెన్యూ ఉద్యోగులు కలవరపాటుకు గురయ్యారు. రియల్ ఎస్టేట్, భూవివాద అంశాలే రమణయ్య హత్యకు కారణాలుగా తెలుస్తోంది. ఇదే విషయాన్ని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మీడియా సమావేశంలో శనివారం మధ్యాహ్నం ప్రస్తావించారు.

రమణయ్య సొంత ఊరు శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం దిమ్మిలాడ గ్రామం. ఆయనకు భార్య, పాప, బాబు ఉన్నారు. పదేళ్ల క్రితం విధుల్లో చేరిన ఆయన ఉత్తరాంధ్రలోని వజ్రపు కొత్తూరు, పద్మనాభం, విశాఖ రూరల్ (చినగదిలి) మండలాల్లో తహ శీల్దార్‌గా మిగతా 2లో..



ఘటనా స్థలంలో విచారణ చేపడుతున్న పోలీసులు

హత్యపై సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం

విశాఖ రూరల్ తహశీల్దార్ సనపల రమణయ్య దారుణ హత్యపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శనివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. మండల మెజిస్ట్రేట్‌కే భద్రత లేనప్పుడు సాధారణ ప్రజానీకం పరిస్థితి చెప్పనవసరం లేదని పేర్కొన్నారు. ఇటీవల విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కుటుంబం కిడ్నాప్‌కు గురైందని, నాడే ప్రభుత్వం కిడ్నాప్‌కు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని వుంటే నేడు ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కావని తెలిపారు. ప్రభుత్వం ఉదాసీనంగా వుండడంతో ల్యాండ్ మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని మిగతా 2లో..



భారీగా తరలివచ్చిన క్రీడాభిమానులు

విశాఖలో క్రికెట్ కోలాహలం



ఇంగ్లండ్‌ను దెబ్బతీసిన టీమిండియా బౌలర్ బుమ్రా

- రెండో రోజూ అదే సందడి
- భారీగా తరలివచ్చిన విద్యార్థులు

వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ చివరి పేజీల్లో..

రైల్వే జోన్‌పై సిగ్గులేకుండా బిజెపి నిరసనలా ?

వార్త 2లో..

నేరాలకు మూలమెక్కడ ?

వార్త 2లో..

బిఎస్ఎన్ఎల్ రక్షణకు సమ్మెను జయప్రదం చేయండి

వార్త 2లో..



నేవీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఐఎన్ఎస్ సంధాయక్ జాతికి అంకితం

తిరుగులేని శక్తిగా భారత్ : రాజ్‌నాథ్ సింగ్ వార్త మెయిన్‌లో..

తెరమీదకు కాశీ విశ్వనాథం

- అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా వైసిపి పరిశీలన
- విజయావకాశాలు, ఆర్థికస్థితే కొలమానం



సిఎం జగన్‌తో కాశీ విశ్వనాథం (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, సీతమ్మధార విలేకరి

ఎన్నికలు సమీపిస్తుండడంతో వైసిపిలో ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు ప్రారంభించారు. పార్టీలో తమకున్న సంబంధాలను ఉపయోగించుకొని టిక్కెట్ సంపాదించాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అనకాపల్లి ఎంపీ టిక్కెట్ విషయమై బొడ్డేడ కాశీ విశ్వనాథం పేరు తెరమీదకొచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం నర్సీపట్నం నియోజకవర్గ ఎన్నిక పరిశీలకునిగా వున్న ఆయన ఎంపీగా పోటీచేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత ఎంపీ డాక్టర్ సత్యవతి ఎంపీగా పోటీచేయడానికి ఏమంత ఆసక్తి చూపకపోవడంతో ఆ స్థానంలో కొత్త వారిని ఎంపిక చేసే అన్వేషణలో వైసిపి అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగా విశ్వనాథం పేరు పార్టీ పరిశీలనలో వున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అనకాపల్లి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలన్న చర్చ తొలుత పార్టీలో సాగినట్లు తెలిసింది. అనకాపల్లి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా నిలబెట్టుకోలేరని భావించి కొద్దిరోజుల క్రితం అమర్‌కు బదులు మలసాల భరత్‌కుమార్‌ను నియోజకవర్గ సమన్వయ కర్తగా వైసిపి నియమించింది. ఎమ్మెల్యేగా గెలవలేని అమర్‌ను ఎంపీగా పోటీ చేయించడం సరికాదన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తంకావడంతో పార్టీ ఉన్నతస్థాయి నాయకత్వం పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది.

విశాఖ డెయిరీ మాజీ ఛైర్మన్ కీర్తిశేషులు ఆడారి తులసీరావు కుమార్తె, యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి కూడా ఎంపీగా పోటీచేయడానికి మొదటి నుంచీ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తెరమీదకు కాశీ విశ్వనాథం

ఆసక్తి చూపుతున్నారు. ఆమె సోదరుడు ఆడారి ఆనంద్ కుమార్ ప్రస్తుతం పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా వున్నారు. పార్టీలో టిక్కెట్ కేటాయింపు అంశంపై అన్ని కోణాల నుంచీ పరిశీలించిన తరువాత అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని నర్సీపట్నం నియోజకవర్గం, మాకవరపాలెం మండలానికి చెందిన కాశీ విశ్వనాథం పేరు పరిశీలనకు వచ్చినట్లు తెలిసింది. అవకాశం కల్పిస్తే తాను అనకాపల్లి ఎంపీగా పోటీచేస్తానని వైసిపి అధినేత, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి కొద్ది నెలల క్రితమే విశ్వనాథం తీసుకెళ్లారు. రాబోయే ఎన్నికల్లో సీట్లు కేటాయింపుపై సామాజిక సమీకరణలు, విజయావకాశాలు, ఆర్థిక పరిస్థితిని ప్రామాణికంగా తీసుకున్న వైసిపి కాశీ విశ్వనాథం పేరును విస్మరించకుండా పరిశీలనలో వుంచినట్లు తెలిసింది. పార్టీ అధినాయకులతో వున్న సత్సంబంధాలు, సామాజిక పరిస్థితుల దృష్ట్యా తనకు ఎంపీ టిక్కెట్ వస్తుందన్న ఆశతో విశ్వనాథం వున్నారు.

హత్యపై సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం

విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన రాజధానిగా ప్రకటించిన ప్రాంతంలోనే శాంతిభద్రతలకు ఇలాంటి పరిస్థితులు వుంటే, రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో చెప్పనక్కరలేదని పేర్కొన్నారు. తహశీలార్ రమణయ్య హత్య పట్ల అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయని, వెంటనే దోషులను అరెస్టు చేసి చట్ట ప్రకారం శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హత్య వెనుక వున్న వారందరినీ ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకూ లొంగకుండా అన్ని కోణాల నుంచీ దర్యాప్తు చేసి శిక్షించాలని నగర పోలీసు కమిషనర్‌ను కోరారు. రాజకీయ రియల్ ఎస్టేట్, భూదందా మాఫియా నుంచి విశాఖ ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు, రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలని కోరారు. కొన్నేళ్లుగా విశాఖలో రాజకీయ రియల్ ఎస్టేట్ మాఫియా చెలరేగిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.

బిఎస్ఎన్ఎల్ రక్షణకు సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశ వ్యాప్తంగా నరేంద్రమోడీ అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరుగుతున్న పారిశ్రామిక సమ్మెలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాగర్ పిలుపునిచ్చారు. శనివారం బిఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు పూనుకుందన్నారు. బిఎస్ఎన్ఎల్‌కు 4జి, 5జి కేటాయించకుండా ప్రైవేట్ కంపెనీలైన రిలయన్స్‌కు కేటాయించడం దుర్మార్గమన్నారు. బిఎస్ఎన్ఎల్ ఆస్తులను నేషనల్ మానిటైజేషన్ ఆఫ్ పైప్‌లైన్ పేరుతో ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని తెలిపారు. బిఎస్ఎన్ఎల్‌లో 2017 నుంచి వేజ్ రివిజన్ జరగలేదని, వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఒక్క బిఎస్ఎన్ఎల్‌నే కాకుండా దేశంలో వుండే ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు లచ్చిరాజు, అష్రఫ్, రామాంజనేయులు, ప్రసాద్‌లతో పాటు బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఈ నెల 16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌నకు పిలుపునిచ్చాయని, ఆ సమ్మెను జయప్రదం చేసేందుకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, బిహెచ్ఇఎల్, బిఎస్ఎన్ఎల్, పోర్టు ట్రస్ట్, గంగవరం పోర్టు, మోటారు ట్రాన్స్‌పోర్టు విభాగాలతో పాటు ఇతర పరిశ్రమల్లో కూడా సమ్మె నోటీసులను యాజమాన్యాలకు ఇచ్చినట్టు సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు.

రైల్వే జోన్‌పై సిగ్గులేకుండా బిజెపి నిరసనలా ?

- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : విశాఖ రైల్వే జోన్‌పై బిజెపి రోజుకొక వివాదాన్ని సృష్టిస్తూ కుట్రతో కాలయాపన చేస్తోందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పుడు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించకపోవడం వల్లే జోన్ ఏర్పాటు ఆలస్యం అవుతోందని మోడీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా అబద్ధాలకు తెగబడిందని తెలిపారు. పై పెచ్చు సిగ్గు లేకుండా బిజెపి విశాఖ శాఖ రైల్వేజోన్‌కి వెంటనే భూమి కేటాయించాలని నిరసన కార్యక్రమం చేపట్టడం దారుణమన్నారు. ఇది బిజెపి మరో సరికొత్త నాటకానికి తెర లేపిందనడానికి ఉదాహరణని తెలిపారు. ఎన్నికలు దగ్గర పడేసరికి ప్రజలను మోసగించటానికి ధర్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పై పెచ్చు వాల్తేర్ రైల్వే డివిజన్ కూడా ఉంటుందని తప్పుడు ప్రకటనలను జివిఎల్.నరసింహారావు చేస్తున్నారన్నారు. ఇదే వాస్తవమైతే మధ్యంతర బడ్జెట్‌లో కనీసం ప్రకటన కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పై పెచ్చు విశాఖ రైల్వేజోన్ నిర్మాణానికి డిపిఆర్ ప్రకారం రూ.170 కోట్లు అవసరమని, కానీ ఈ బడ్జెట్‌లో ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. సరిపడా నిధులు కేటాయించకుండా ఇప్పుడు భూమి కేటాయించలేదని, అందుకే జోన్ ఆలస్యం అవుతోందని బిజెపి నేతలు చెబుతున్నారన్నారు. మోడీ ప్రభుత్వ కనుసన్నల్లో పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వం కేంద్రం ఆదేశిస్తే జోన్‌కు భూమి కేటాయించిదా ? ప్రజలను బిజెపి నేతలు ఇంకెంత కాలం మోగిస్తారు ? అని జగ్గునాయుడు ప్రశ్నించారు. గతంలో వైబుల్ కాదని, కొత్త జోన్‌లు ఏర్పాటు సాధ్యం కాదని ఇలా అనేక వివాదాలు లేపిందన్నారు. అయినా ఆంధ్ర రాష్ట్ర ప్రజలు బిజెపి మోసకారి వాదనలను తిప్పికొడుతూ పోరాటం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇదేస్ఫూర్తిని కొనసాగించాలని, బిజెపి ఎన్నికల జిమ్మిక్కులను తిప్పి కొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బిజెపి నేతలు నాటకాలు ఆపి, చేతనైతే వారి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జోన్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

'రియల్' కారణాలేనా..?

(మొదటి పేజీ తరువాయి..)

పనిచేశారు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. తొలిరోజు విధులకు హాజరై రాత్రి 8 గంటల సమయంలో తాను నివాసం ఉంటున్న కొమ్మాదిలోని ఎస్‌టిబిఎల్ థియేటర్ వెనుక ఉన్న చరణ్ క్యాస్టల్స్ అపార్టుమెంట్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో రాత్రి 10 గంటల సమయంలో దాడి జరిగింది. ఇనుపరాడ్డుతో గుర్తు తెలియని వ్యక్తి తలపై కొట్టడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం ఆరిలోవలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. రమణయ్య కుటుంబీకులను ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు సత్తి నాగేశ్వరరెడ్డి, తదితరులు విశాఖలోని కెజిహెచ్ వద్ద పరామర్శించారు. ప్రభుత్వ భూములకు రక్షణగా ఉన్న ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని ఈ సందర్భంగా వారు మీడియాకు తెలిపారు. అనంతరం ఉద్యోగులంతా కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. రమణయ్య కుటుంబీకులను టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, జనసేన నాయకులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు.



రమణయ్య మృతదేహాన్ని చూసేందుకు కెజిహెచ్‌కు తరలివచ్చిన ఉద్యోగులు

ముక్కుసూటి మనిషిగా రమణయ్యకు పేరు

ముక్కు సూటి మనిషిగా, అవినీతికి దూరంగా ఉండే వ్యక్తిగా రమణయ్యకు పేరు. భూదందాలకు పెట్టింది పేరుగా వున్న చినగదిలి మండలంతో పాటు ఆయన పలుచోట్ల రెవెన్యూ విభాగంలో పనిచేశారు. ఈ క్రమంలో భూ ఆక్రమణలకు సహకరించకపోవడమే ఈ హత్యకు కారణమేమోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



కెజిహెచ్ మార్చురీ వద్ద దిగాలుగా రమణయ్య కుటుంబీకులు

నేర రాజధానిగా విశాఖ : మాజీ మంత్రి గంటా

పారిశ్రామిక రాజధానిగా ఉన్న విశాఖపట్నం వైసిపి ప్రభుత్వం కారణంగా నేర రాజధానిగా మారిపోయిందని టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. హత్యకు గురైన తహశీల్దార్ రమణయ్య హత్య తనను కలచి వేసిందన్నారు. శనివారం రమణయ్య కుటుంబ సభ్యులను కెజిహెచ్ మార్చురీ వద్ద పరామర్శించి ఆయన ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విశాఖలో క్రైమ్ రేట్ పెరిగిపోతోందన్నారు. కార్యక్రమంలో టిడిపి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన భూ మాఫియా : జనసేన నగర అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రశాంత విశాఖ నగరంలో రియల్ ఎస్టేట్, భూ మాఫియాలు పెరిగిపోయాయని జనసేన నగర అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరోపించారు. రమణయ్య మృతదేహం ఉన్న కెజిహెచ్ మార్చురీ వద్ద ఆయన కుటుంబ సభ్యులను వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు.

తహశీల్దార్ హత్యకు ఖండనలు

మధురవాడ : తహశీల్దార్ రమణయ్య హత్యను సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఖండించారు. సనపల రమణయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

భీమునిపట్నం : సనపల రమణయ్య హత్యను భీమిలి నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కోరాడ రాజబాబు తీవ్రంగా ఖండించారు. సంఘటనా స్థలానికి చేరుకుని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు హత్యను తీవ్రంగా ఖండించారు.

నేరాలకు మూలమెక్కడ ?



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

తహశీల్దార్ రమణయ్య హత్య విశాఖ నగరంలో పెరుగుతున్న నేర ప్రవృత్తిని సూచిస్తోంది. పౌర సమాజం మౌనం వీడి, నేర స్వభావ శక్తులను ఏకాకులను చేసేందుకు ఏకోన్ముఖులు కాకపోతే విలాసవంతమైన నగర జీవితంలో విషాదం ఏ ఇంటిలో ఎప్పుడు నెలకుంటుందో, ఏ మానవ మృగంచేతిలో ఎవరెప్పుడు బలవుతారో చెప్పలేని పరిస్థితి ముందుకొచ్చింది. తహశీల్దార్ హత్య ఒక వార్తగా చూస్తే సంచలనం కావొచ్చు. సామాన్యుల్లో విషాదాన్ని, భయాన్ని, ఆందోళనను కల్గించవచ్చు. ఆర్థిక నేరగాళ్లు నగర ప్రజలకు విసిరిన సవాల్ ఇది. తమ మాటకు ఎదురొస్తే, కావాల్సిన భూములు, స్థలాలు వదులుకోకపోతే, ఆర్థిక ప్రయోజనాలకు అడ్డుతగిలితే చెల్లించుకోబోయే మూల్యం ఎలావుంటుందో ఆర్థిక నేరగాళ్లు చేసిన హెచ్చరిక ఇది. రాజకీయావతారమెత్తిన కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ పదవులు, హోదాలను అడ్డంపెట్టుకొని సాగిస్తున్న దురాక్రమణలు నగర ప్రజలకు తెలియనవికావు. చేసిన తప్పులను, నేరాల్ని సొమ్ము చేసుకొని బతుకుతున్న ప్రబుద్ధులు లేకపోలేదు. నేర నియంత్రణ వ్యవస్థలు ఎంత బలహీనంగావున్నా, పౌర సమాజం ఓ మంచి బలమైన శక్తిగా ఎదిగితే ఆర్థిక నేరగాళ్లనేకాదు, వారిని వెనుకేసుకొచ్చే దుర్మార్గ పాలనా వ్యవస్థలను మట్టుబెట్టడం ప్రజలకు కష్టమేమీకాదు.

భూ, స్థల వివాదాల చిక్కుముడులు ఇప్పుకోలేక, ఆక్రమణదారులను ఎదిరించలేక దిక్కులేని జనం పోలీసు వైపు దిక్కులు చూస్తుంటే, పరిష్కారం చూపాల్సిన వారు ఇవి సివిల్ విషయాలని కొట్టిపారేయడమే ఆక్రమణదారులకు ఒక వరంగా మారింది. పోలీసులు ఇప్పటికైనా వాస్తవాలను పరిశీలించి, ప్రజల విజ్ఞాపనలో వున్న నిజమెంతో పరిశీలించి పరిష్కారం చూపాలి. సామాన్యులకు ఒక భరోసా ఇవ్వాలి. ఆర్థిక, రాజకీయ వ్యాపార నేరగాళ్లకు కళ్లెంవేయాలి. అటు ప్రభుత్వమూ, ఇటు ప్రభుత్వ యంత్రాంగమూ ప్రజల ఆకాంక్షలు గౌరవించాలి. వ్యక్తుల లాభాల కోసం విశాల ప్రజల ప్రయోజనాలు, బతుకులు దెబ్బతీసి పనికి పాల్పడ్డం మానేయాలి.

అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణభారతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి జోన్ 3 పరిధిలోని స్వర్ణ భారతి స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆధునికీకరించి స్పోర్ట్స్ ఎరీనాగా అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు

జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి - ఆరిలోవ: నగర ప్రజలకు క్రీడా ప్రాంగణాలను అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రతి జోన్‌లో స్టేడియాలను అభివృద్ధి చేసేందుకు జివిఎంసి ప్రణాళికలు రూపొందిస్తుందని కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ తెలిపారు. జోన్ 2 పరిధి ఆరిలోవ హెల్త్ సిటీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలాన్ని జివిఎంసి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఇండోర్ స్టేడియం నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు 2.8 ఎకరాల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ప్రజల క్రీడా సౌలభ్యం కోసం ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్‌రాజును ఆదేశించారు. ఈ ప్రతిపాదిత స్థలంలో ఉన్న చెట్లకు ఆటంకపరచకుండా, రక్షణ గోడను ఏర్పాటుచేస్తూ స్టేడియంలో క్రీడలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు, మౌలిక వసతులు ఉండేటట్లు ప్రణాళిక సిద్ధం చేసి నివేదికను సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం హెల్త్ సిటీ రోడ్లను పరిశీలించి రోడ్డుకు ఇరువైపులా పచ్చ దనాన్ని పెంపొందించేందుకు ఏర్పాట్లు చేపట్టాలని శాంసన్ రాజుకు సూచించారు. హెల్త్ సిటీ ప్రాంతంలో నిత్యం పరిశుభ్రత పనులు చేపట్టాలని హెల్త్ ఆఫీసర్ కిషోర్‌ను కమిషనర్ ఆదేశించారు. అనంతరం 12వ వార్డు పరిధి క్రాంతినగర్ లే-అవుట్ సమీపంలో ఖాళీ స్థలాన్ని పరిశీలించి, ఆ ప్రదేశంలో పార్కు నిర్మాణానికి ప్రణాళికను సిద్ధం చేయాలని శాంసన్ రాజును ఆదేశించారు. పెదగదిలి నుంచి తోటగురువు వెళ్లే మార్గంలో 60 అడుగుల రోడ్డు విస్తరణ, కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహలక్ష్మి, ఇఇ శాంతి రాజు, ఎసిపి శాస్త్రి, ఎఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడా స్థలాన్ని పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ

నేరాలు ఘోరాలు

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలోని కొడవటిపూడిలో నిలవ ఉంచిన మద్యాన్ని పోలీసులు శనివారం పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై రమణయ్య మాట్లాడుతూ, గ్రామంలో అక్రమంగా నిలవచేసి అమ్మకం చేపడుతున్న సుమారు 269 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కర్రి అమ్మాజీపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. మద్యం, సారా అమ్మకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: 4 కేజీల గంజాయితో ముగ్గురు యువకులను పట్టుకున్నామని కేడీపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. శనివారం కేడీపేట పిహెచ్‌సి చెక్ పోస్టు వద్ద గుంటూరు జిల్లాకు చెందిన కార్తిక్, మోహన్, జ్యోతిబాబు నడిచి వెళుతుండగా అనుమానం వచ్చి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి గుర్తించామన్నారు. వారిపై కేసు నమోదు చేసిన రిమాండ్‌కి తరలించామని, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు.


పోటీలో తలపడుతున్న శ్రీకాకుళం - కృష్ణా జిల్లా జట్లు

హోరాహోరీగా రగ్బీ పోటీలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ మినీ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 2న ప్రారంభమైన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు శనివారం కూడా కొనసాగాయి. పలు జిల్లాల జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయి. శ్రీకాకుళం, కృష్ణా జిల్లా బాలుర జట్లు మధ్య, ప్రకాశం, తూర్పు గోదావరి బాలికల జట్ల మధ్య పోటీ జరిగింది. మరికొన్ని జిల్లాల జట్ల మధ్య కూడా పోటీ జరిగింది. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన 14 ఏళ్ల లోపు బాలురు, బాలికలు పోటీల్లో పాల్గొన్నారు.


రుషికొండ తీరంలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న గీతం ప్రతినిధులు

సందడిగా గీతం సముద్ర తీర ఉత్సవం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం యువతలో విజ్ఞాన నైపుణ్యాలతో పాటు సాంస్కృతిక, క్రీడలను ప్రోత్సహించడానికి ఏటా "షోర్ ఫెస్ట్" పేరిట నిర్వహించే సముద్ర తీర ఉత్సవం శనివారం రుషికొండ తీరంలో అట్టహాసంగా ప్రారంభమైంది. వందలాది మంది విద్యార్థులు తరలి రావడంతో గీతం ప్రాంగణంలో యువజనోత్సాహం అంబరాన్ని తాకింది. సముద్ర ప్రాణులను రక్షించుకోవడం, తీర ప్రాంత పరిశుభ్రతల ప్రాధాన్యత తెలిపే విధంగా రుషికొండ బీచ్ ఇసుక తిన్నెలపై ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. లింగ వివక్షత లేని సమాజం, ఆరోగ్యకరమైన జీవనం, మంచి నడవడిక అంశాలను ఈ ఉత్సవానికి నినాదంగా ఎంచుకోవడం అభినందనీయమన్నారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, స్టూడెంట్ లైఫ్ డైరెక్టర్లు, వివిధ విభాగాల డీన్‌లు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వీనుల విందైన సంగీతాన్ని నేవీ బ్యాండ్ బృందం ఆలపించడం యువతలో ఉత్సాహన్ని నింపింది. వివిధ వేదికలపై సమకాలీన అంశాలపై ప్రముఖులతో ప్రసంగాలను ఏర్పాటుచేశారు. గీతంలోని క్రీడా మైదానాలు, స్టేడియంలలో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నాలుగో వార్డులో జనసేన పాదయాత్ర

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డులోని పలు ప్రాంతాల్లో భీమిలి నియోజకవర్గ జనసేన ఇంఛార్జి పంచకర్ల సందీప్ ఆధ్వర్యాన శనివారం పాదయాత్ర నిర్వహించారు. కాపులుప్పాడ, పరదేశిపాలెం, సోమన్నపాలెం, కల్లివానిపాలెం ప్రాంతాల్లో పాదయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాలుగో వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి సిపిఎస్‌పి అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్నికైన ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, రమాదేవి, జిల్లా మహిళా అధ్యక్షులుగా ఎన్నికైన లీలామణిని కార్యవర్గ సభ్యులు సన్మానించారు. ఈ మేరకు శనివారం భీమిలిలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రామకృష్ణ, ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణ ఆధ్వర్యాన శనివారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నౌకాదళ సేవలు నిరుపమానం : శ్రీభరత్

ప్రజాశక్తి-మధురవాడ : దేశ రక్షణకు భారత నౌకాదళం చేస్తున్న సేవలు నిరుపమానం అని వారి కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యంగా నౌకాదళంలో పనిచేసే వారి సేవలకు గుర్తింపుగా నామ మాత్రపు ఫీజులతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసేందుకు సహకారం అందిస్తున్నట్లు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. భారత నౌకాదళానికి చెందిన నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ (ఎన్‌డబ్ల్యుడబ్ల్యుఎ)తో శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం కోసం పోరాడే నౌకాదళ కుటుంబాలకు అండగా నిలవడం బాధ్యతగా భావించి ముందుకొచ్చినట్లు తెలిపారు. నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు.

గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షులు కళాహరికుమార్, తూర్పు విభాగం అధ్యక్షులు సంధ్యా పెండార్కర్, నౌకాదళ విద్యా విభాగం కమాడోర్ జి.రాంబాబు అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అవగాహన ఒప్పందంలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైద్య కళాశాల, ఇతర విభాగాలలో నిబంధనలకు అనుగుణంగా నౌకాదళ సిబ్బంది పిల్లలకు ప్రవేశాలు కల్పిస్తారు. విశ్వవిద్యాలయంలోని విభాగాలకు రక్షణ సాంకేతిక పరిజ్ఞానంపై బోధన, పరిశోధనలకు నౌకాదళం సహకారం అందిస్తుంది. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ విజయశేఖర్, వైస్ ఎడ్మిరల్ గురుచరణ్‌సింగ్, కమాడోర్ ప్రదీప్‌పటేల్ పాల్గొన్నారు.

భీమిలి అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికపై పుకార్లు షికార్లు

ప్రజాశక్తి-పద్మనాభం : భీమిలి అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికపై పద్మనాభం మండలంలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. గ్రామాల్లో రచ్చబండలు, టీ దుకాణాల వద్ద దీనిపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు టికెటు లభిస్తుందని వాదనలు వినిపించినా విశాఖ ఎంపీ టికెట్ బొత్స ఝాన్సీకి ఖరారు కావడంతో సమీకరణలు మారుతున్నాయని చర్చ నడుస్తోంది. కొంతకాలం వైఎస్ భారతి భీమిలి నుంచి పోటీచేస్తారని ప్రచారం జరగ్గా ప్రస్తుతం బొత్స సత్యనారాయణ పోటీలో ఉంటారని చర్చ సాగుతోంది. విజయనగరం జిల్లాలో బొత్స సత్యనారాయణను తప్పించాలని అధిష్టానం చూస్తోందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

టిడిపిలో మూడేళ్ల క్రితం కోరాడ రాజబాబును చంద్రబాబు పిలిచి భీమిలి టికెటు ఇస్తాను పార్టీని బలోపేతం చేయాలని హామీ ఇచ్చి భీమిలి ఇన్‌ఛార్జిగా ప్రకటించారు. అప్పటి నుంచి కోరాడ రాజబాబు పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్నారు. ఇప్పుడు ఆయన ఆశలపై నీళ్ల జల్లినట్లు ఉందని ప్రస్తుతం చర్చలు సాగుతున్నాయి. కొంత కాలంగా గంటా శ్రీనివాసరావు ఇక్కడి నుంచి పోటీ చేస్తారని ప్రచారం నడుస్తోంది. నారా భువనేశ్వరి, నారా లోకేష్ కూడా ఇక్కడి నుంచి పోటీలో ఉంటారని చర్చలు జోరుగా సాగుతున్నాయి. తెలుగుదేశం, జనసేన కూటమి వల్ల భీమిలి సీటు జనసేనకు కేటాయించారని, పంచకర్ల సందీప్‌కుమార్ పోటీలో ఉంటారని ఆ పార్టీ నేతల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి.

రెటినో బ్లాస్టోమా కంటి కేన్సర్ ప్రాణాంతకం



డాక్టర్ వీరేందర్ సచ్‌దేవ్

ప్రజాశక్తి - ఆరిలోవ : మూడేళ్లలోపు పిల్లల్లో సంభవించే రెటినో బ్లాస్టోమా కంటి కేన్సర్ అత్యంత ప్రాణాంతకమైనదని, పిల్లల దృష్టికి ప్రమాదం కలిగిస్తుందని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల అధిపతి డాక్టర్ వీరేందర్ సచ్‌దేవ్ పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాలలో శనివారం రెటినో బ్లాస్టోమా కంటి కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సచ్‌దేవ్ మాట్లాడుతూ పిల్లల కంటిలో తెల్లని ప్రతిబింబం కంటి కేన్సర్‌కు సంకేతం కావచ్చని తెలిపారు. ఈ వ్యాధిపై అవగాహన తక్కువ కావడంతో పిల్లల్లో ఏటా 1500 కొత్త కేసులు బయటపడుతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయని వివరించారు. కేన్సర్ కేసులలో అధిక భాగం చివరి దశలో గుర్తించటం, సకాలంలో సరైన చికిత్స అందించకపోవడం కారణంగా 50 శాతం ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిపారు. తెల్లని ప్రతిబింబంతో పాటు మెల్లకన్ను కంటి పరిమాణంలో వ్యత్యాసాలు, ఎరుపుదనం, కనురెప్పల వాపులు కనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధికి వివిధ రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. దశాబ్ద కాలంలో ఎల్‌వి.ప్రసాద్ కంటి వైద్యశాల కేంద్రాలలో ఇప్పటివరకు 15 వేలకు పైగా రెటినో బ్లాస్టోమా కేసులకు చికిత్స చేసినట్లు వివరించారు.

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి -పిఎం పాలెం : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐఒసిఎల్ సిఎస్ఆర్ నిధులు రూ.33లక్షలతో 284 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంపిణీచేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ మాధవి, ఐఒసిఎల్ ప్రతినిధులు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : రంగం ఏదైనా నైపుణ్యాన్ని పెంచుకోవాలని పిహెచ్‌డి గ్రహీత డాక్టర్ జగన్నాథరావు బిడిఎస్ విద్యార్థులకు సూచించారు. స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో అకడమిక్, కెరీర్, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్‌పై బిడిఎస్ విద్యార్థులకు కళాశాల ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరిగిన సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ, వృత్తిపరమైన పరిజ్ఞానం, నైపుణ్యం పెంపుదలకు దోహద పడేలా సూచనలు చేశారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ రావు మాట్లాడుతూ, అకడమిక్ ఎక్సలెన్స్, కెరీర్ గ్రోత్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కళాశాల డీన్ డాక్టర్ పివి.సుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ జగన్నాథరావు

స్టీల్‌ప్లాంట్ ఆసుపత్రి ప్రయివేటీకరణ విరమించాలని ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్ ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున నినదించారు. ధర్నా అనంతరం ఇన్‌ఛార్జి విభాగాధిపతి డాక్టర్ సారంగికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ ఆసుపత్రిపై గద్దల్లా వాలడానికి అనేక కార్పొరేట్ ఆసుపత్రులు సిద్ధంగా ఉన్నాయన్నారు. దీనిని సందర్శించడానికి ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు విచ్చేస్తే యాజమాన్యం ఎర్రతివాచీ పరిచి స్వాగతం పలకడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది పోరాటాలతో సాధించుకున్న ఆసుపత్రి అని, దీనిని పోరాటాల ద్వారానే కాపాడుకుంటామని చెప్పారు. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, ఉక్కు ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలను అందించాల్సిన ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బందితోపాటు పారామెడికల్ స్టాఫ్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, స్టీల్ సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు, సిఎఫ్‌టియు నాయకులు శ్రీనివాస్, ఎఐసిటియు నాయకులు సిహెచ్.సన్యాసిరావు మాట్లాడుతూ, ఉద్యోగులకు మందులు అందుబాటులో లేకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే అన్ని మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల నాయకులు విడివి.పూర్ణచంద్రరావు, గడ వెంకటేశ్వరరావు, లోకేష్, దుర్గాప్రసాద్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రాజు, పవన్, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షులు వివి రమణ, ఐద్వా నాయకులు కె.వేణు, కార్మికులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



డాక్టర్ సారంగికి వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

గంగవరం రోడ్డు విస్తరణ చేపట్టాలని ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ జంక్షన్ నుంచి గంగవరం వెళ్లే ప్రధాన రహదారిని విస్తరించాలని కోరుతూ సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం సభ్యులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కంబాల మహేష్ మాట్లాడుతూ, రోడ్డు మాస్టర్ ప్లాన్‌లో 100 అడుగుల రోడ్డు ఉండగా 25 అడుగుల రోడ్డు మాత్రమే నిర్మాణం చేశారని, మిగిలిన భూములను గంగవరం పోర్టు యాజమాన్యం, శ్రావణి షిప్పింగ్ యాజమాన్యం ఆక్రమించుకున్నారని ఆరోపించారు. గోపి మాట్లాడుతూ, గంట్యాడ నుంచి గంగవరం వచ్చే మార్గంలో 25 అడుగుల రోడ్డును వెంటనే 100 అడుగులకు విస్తరణ చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. చోడిపిల్లి ప్రసాద్ మాట్లాడుతూ, ఇప్పటికే గ్రామ ప్రజలు అనేకసార్లు ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు వినతులు ఇచ్చినా ఎటువంటి చర్యలూ లేవన్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పెదగంట్యాడ తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో వై.ప్రతాప్, వై.శివ, కేశవ, మురళి, చంద్రశేఖర్, కె.ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించడం బాధ్యత

ప్రజాశక్తి -కరాస : తల్లిదండ్రులను, పెద్దవారిని గౌరవించడం పిల్లల బాధ్యత అని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ జె.మహేష్ అన్నారు. విద్యార్థులలో నైతిక విలువలు, మంచి ప్రవర్తన, పెద్దలు, తల్లిదండ్రులు పట్ల గౌరవం అలవాటు చేసే ఉద్దేశంతో ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఎంత ఉన్నత స్థానానికి ఎదిగనా జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరువకూడదన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులకు వారి పిల్లలు పాదపూజ చేసి శాలువాతో సత్కరించి, దీవెనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇంఛార్జి బి.సోనియా, డీన్ టి.సురేష్, ఎస్ బ్యాచ్ ఇంఛార్జి లక్ష్మి మాధవి, ప్రీ ప్రైమరీ ఇంఛార్జి జి.శ్రీవాణి, ఎఒ సూర్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన జెడ్‌సి

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 95వ వార్డు పరిధిలోని 500 నెంబర్ సచివాలయాన్ని జివిఎంసి జోన్-8 కమిషనర్ కె.హేమావతి శనివారం సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమతమ పనులను బాధ్యతగా చేయాలన్నారు. పనులు పెండింగ్‌లో ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.శివప్రసాద్, వాటర్ వర్క్స్ ఎఇ రాజశేఖర్, శానిటేషన్ సూపర్‌వైజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధి సాయిదుర్గానగర్‌లో ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు శనివారం శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.16 లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.హేమావతి, డిఇ విజయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది భారతి, హేమంత్, చిరంజీవి, నాయుడు, శ్రీదేవి, ప్రియాంక, వైసిపి నాయకులు బండి సత్తిబాబు, శ్రీకాంత్, దాసరి సత్తిబాబు, అడ్డాల రామరాజు, 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్న, వినోద్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కోరాడ పంచాయతీ గద్దపేట గ్రామంలో శనివారం కుష్టి వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని బ్రైటర్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టి వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిసిఒ గురునాథరెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మిడ్డే కార్మికుల ధర్నా



మిడ్డే కార్మికుల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లోని విద్యాశాఖ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు అక్కయ్యపాలెం జోన్ నాయకులు రాజు మాట్లాడుతూ, గత ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో తాము అధికారంలోకి వస్తే రూ.10 వేలు వేతనం ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు, మెనూచార్జీ రూ.20కి పెంచాలని, గ్యాసును ప్రభుత్వమే సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. వంటచేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్ట పరిహారం, మట్టి ఖర్చులు ఇవ్వాలని, హైస్కూలులో పనిచేస్తున్న వారికి వేతనం, సెలవులు, మెటర్నిటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని సంవత్సరానికి 2 జతల యూనిఫామ్ ఇవ్వాలని, 2 నెలలకు ఒకసారి వర్కర్లతో ఎంఇఒలు సమావేశాలు పెట్టాలని డిమాండ్‌చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగశ్రీ, జోన్ నాయకులు కలాచందన, వరలక్ష్మి, దేవి, నిర్మల, కనక, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



వృథాగా పోతున్న తాగునీరు

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 95వ వార్డు పరిధి వేపగుంట -చీమలాపల్లి ప్రధాన రహదారిలో పైపులైను లీకై నీరు వృథాగా పోతోంది. సుమారు నెల రోజులైనా అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై నీటి సరఫరా ఎఇ రాజశేఖర్‌ను ప్రశ్నించగా పైపులైన్ లీకు విషయం తమ దృష్టికి వచ్చిందని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేస్తున్నప్పుడు పైపులైన్ పగిలిందని, ఈ విషయాన్ని యుజిడి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. త్వరలో మరమ్మతులు జరిగేలా చూస్తామని ఎఇ తెలిపారు.

యుపిహెచ్‌సి ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మురళీనగర్‌లో రూ.47.50 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్‌ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యుపిహెచ్‌సి)ని వంశీనగర్లో రూ.49.90 లక్షలతో నిర్మించిన నూతన సామాజిక భవనాన్ని వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యాన మేయర్ హరివెంకటకుమారి, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఒ జగదీష్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, చల్లా రజిని, కంటిపాము కామేశ్వరి, రెయ్యి వెంకటరమణ, కె.అనిల్‌కుమార్‌రాజు, కెవిఎన్ శశికళ, సేనాపతి అప్పారావు, ఇఇ మచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు ప్రారంభం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో దబ్బంద పంచాయతీ పరిధిలో శనివారం 1902 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్ ఇంటి పేపర్లతో సహా తాళాలను అందించారు.

'భాస్కర్'లో సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి -గాజువాక : భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం సైన్స్ సంబరాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థులచే సైన్స్ ఎగ్జిబిషన్, వైజాగ్ ఫిలాటిలిక్ సొసైటీ సభ్యులు కెసి.నాయుడు, విశ్వనాథం, కె.శ్రీనివాస్, పి.గోవింద్‌రాజు, జెఎస్.సురేష్ ఆధ్వర్యాన నాణేలు, స్టాంపులు ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీశంకరరావు ప్రారంభించారు. నర్సరీ నుంచి 10వ తరగతి విద్యార్థులు పలు ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. సోలార్ ఎనర్జీ ట్రాఫిక్ నిబంధనలు, రైలు ప్రమాదాల నివారణ, మానవ హృదయం, గుండె పనితీరు, ఇస్రోప్రయోగాలు, రోడ్డుపై చెత్తను సులువుగా సేకరించుట, పాస్టిక్ నివారణ, గాలి, నీరు కలుషిత నివారణ, నీటిని శుభ్ర పరచటం తదితర సుమారు 80 రకాల నమూనాలను విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు. 9, 10 తరగతుల విద్యార్థులు నిర్వహించిన మెడికల్ క్యాంపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం గౌరీశంకరరావు మాట్లాడుతూ, నిత్య జీవితంలో మానవాళికి ఉపయోగపడే అనేక అంశాలపై నమూనాలు తయారుచేసి చక్కగా ఇంగ్లీషు భాషలో వివరించిన విద్యార్థులను అభినందించారు. ఈ ఎగ్జిబిషన్‌ను చిట్టినాయుడు కాలనీ, చట్టివాని పాలెం, దశమికొండ కాలనీలకు చెందిన ప్రజలు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర పాఠశాలల విద్యార్థులు, జివ్సా పరిధిలోని పాఠశాలల విద్యార్థులు, డైరక్టర్లు సందర్శించారు.



సైన్స్ ప్రదర్శనలను వివరిస్తున్న విద్యార్థులు

ప్రశాంత విశాఖలో హత్యలు : గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రశాంతతకు మారుపేరైన విశాఖలో తహశీల్దార్‌ను హత్య చేయడం ఏమిటని, పోలీసు వ్యవస్థ ఏం చేస్తుందని విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పటిష్టంగా లేదన్నారు. ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్ వేనన్నారు. ఇటీవల ఓ విదేశీయునిపై దాడి చేయటంతో రాష్ట్ర పరువు పోయిందన్నారు. విశాఖ ఎంపీ ఇంట్లోనే కిడ్నాప్ జరగడంతో విశాఖకు వలస వచ్చిన ప్రజలు భయాందోళన మధ్య బ్రతుకుతున్నారని తెలిపారు. విశాఖలో అధికారులకు కూడా రక్షణ లేదన్నారు. రాజకీయ సభ నిర్వహణ కోసం ఇంటర్ పరీక్ష వాయిదా వేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి రావలసిన పరిశ్రమలు రాక, ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. దీంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. రైల్వే జోన్ ఇక్కడికి వస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరిగి ఉండేవని చెప్పారు. కేంద్రం రైల్వే జోన్ ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అనువైన స్థలాన్ని ఇప్పటివరకు అప్పగించలేదని కేంద్రం చెబుతోందని తెలిపారు. దీనిపై ప్రభుత్వ ఉన్నతాధికారులు భిన్నభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు తప్ప స్పష్టమైనటువంటి ప్రకటన చేయట్లేదని విమర్శించారు.

రోడ్డు నిర్మాణానికి విస్తృతంగా సంతకాల సేకరణ



రోడ్డు పునర్నిర్మించాలని దండం పెడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం

అచ్యుతాపురం -అనకాపల్లి రహదారి నిర్మించాలని సిపిఎం చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం విస్తృతంగా జరుగుతుంది. నాలుగో రోజు శనివారం హరిపాలెం గ్రామంలో సిపిఎం నాయకులు కె.రామసదాశివరావు, ఆర్.రాము ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ముఖ్యమంత్రికి దండం పెడుతూ వెంటనే రోడ్డు నిర్మించాలని కోరారు. ఈమార్గంలో ప్రయాణించే వాహనదారులు, డ్రైవర్లు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్ రాము మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యను అధికారుల దృష్టికి ఉద్యమంగా తీసుకువెళ్లటమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.కనుమునాయుడు, మారిశెట్టి పరదేశి నాయుడు, బుద్ధ రంగారావు, బి రామ్‌కుమార్, కె.బాబురావు పాల్గొన్నారు.

మునగపాక : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డును పునర్నిర్మించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతకాల సేకరణ శనివారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. మండలంలోని నాగులపల్లి మెయిన్ రోడ్‌లో శనివారం చేపట్టిన ఈ కార్యక్రమంలో వాహనదారులు, నాగులపల్లి ప్రజలు అత్యధిక మంది పార్టీలకు అతీతంగా పాల్గొని సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం చేపట్టే వరకు ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. అవసరమైతే నిరవధికంగా రోడ్డు దిగ్బంధం చేయాలని, దీనికి వేలాదిగా ప్రజలు రావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో రోడ్డు వేసిన వారికి మాత్రమే ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాండ్రేగుల సదాశివరావు, ఎస్ కన్నుమునాయుడు, ఎస్ బ్రహ్మాజీ, వివి శ్రీనివాసరావు, కాండ్రేగుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుండి సంతకాలు సేకరణ చేస్తున్న సిపిఎం నాయకులు

డిఎస్‌సి పేరుతో జగన్నాటకం

ప్రజాశక్తి-అనకాపల్లి, బుచ్చయ్యపేట : ఎన్నికలకు 2 నెలల ముందు డిఎస్సీ నోటిఫికేషన్ పేరుతో ముఖ్యమంత్రి సరికొత్త జగన్నాటకానికి తెరలేపారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు విమర్శించారు. అనకాపల్లిలో నాగజగదీశ్వరరావు, బుచ్చయ్యపేటలో తాతయ్యబాబు శనివారం విలేకర్లతో మాట్లాడుతూ 4 సంవత్సరాల తొమ్మిది నెలలుగా ఉపాధ్యాయుల భర్తీని పట్టించుకోకుండా, ఇప్పుడు రాజకీయ ఎత్తుగడలో భాగంగా ఎన్నికల ముందు హడావుడి చేస్తున్నారని, అబద్ధాలు, మోసం, వంచనకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. 2021 - 22 నాటికి ఎపిలో 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 12,386 పాఠశాలలు ఒక్క ఉపాధ్యాయుడితోనే నడుస్తున్నాయని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం చెప్పిందని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 18 వేల ఖాళీలు ఉన్నాయి కానీ 8,366 పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి బొత్స అసెంబ్లీలో ప్రతిించి, ఇప్పుడు అందులో కూడా 2,366 పోస్టులకు కోతపెట్టి 6 వేల పోస్టులను ప్రకటించడం నిరుద్యోగ యువతను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఆయా విలేకర్ల సమావేశాల్లో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మండల క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి అచ్యుతాపురం : ఆడదాం ఆంధ్ర పోటీలలో భాగంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలకు అచ్యుతాపురం మండలానికి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు ఎంపిడిఒ సురేష్ కుమార్ తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గం స్థాయిలో వారు రాణించారని చెప్పారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని ఉప్పవరం గ్రామానికి చెందిన మహిళ జట్టు, హరిపాలెం పురుషుల జట్టు ఖోఖో పోటీలకు, పూడిమడక పురుషుల జట్టు కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

2వ రోజుకు యుటిఎఫ్ దీక్షలు



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ, ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం 18 వేల 9 కోట్ల రూపాయలు బకాయి పడిందని, ఈ పరిస్థితి చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా దివాలా తీసిందా అని ప్రశ్నించారు. ఒక వైపు రాష్ట్ర ఆర్థిక మంత్రి, రాష్ట్రం ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉందని చెబుతుండగా, మరో వైపు ఒకటో తేదీన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్, జిపిఎస్ విధానాలను వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ పథకం అమలు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నెల్లి సుబ్బారావు, వత్సవాయి శ్రీలక్ష్మి, గాయత్రి, జోగా రాజేష్, రమేష్ రావ్, శేషుకుమార్, జిఎస్ ప్రకాష్, జికె ఆర్ స్వామి, ఎల్లయ్యబాబు, ఆళీ, వెంకట్రావు, శివశ్రీ, ప్రసన్న, బాబూరావు, కామరాజు, బొడ్డపాటి రామచంద్ర, బండారు శంకర్, మహేష్, శ్రీను, బాలరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జెవివి కళాజాతాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న ప్రజా సైన్స్ కళాజాత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఎం వెంకట అప్పారావు, కార్యదర్శి బి రామ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 5వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కళాజాతా జరుగుతుందని, అచ్యుతాపురం మండల కేంద్రానికి సోమవారం సాయంత్రం కళాజాత వస్తుందని తెలిపారు. విజ్ఞానాన్ని అందించే ఈ సైన్స్ కళా యాత్ర అచ్యుతాపురం శ్రీవాణి విద్యానికేతన్‌లో జరుగుతుందని, సైన్సు నృత్య రూపకాలు, నాటికలు, గీతాలాపన, మ్యాజిక్ ప్రదర్శనలు, సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించబడతాయని పేర్కొన్నారు. ఈ సైన్సు కళ యాత్రకు అందరూ హాజరై తిలకించాలని కోరారు.

'వైబ్రెంట్ వైట్-2024' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక వైట్ కళాశాల వార్షికోత్సవంలో భాగంగా శనివారం 'వైబ్రెంట్ వైట్ -2024' పోస్టర్‌ను శనివారం కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్షికోత్సవం ఫిబ్రవరి 10వ తేదీన కళాశాలలో జరుగుతుందని చెప్పారు. విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా ప్రతిసంవత్సరం వైబ్రెంట్ వైట్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు విజ్ఞాన సాంస్కృతిక, క్రీడలలో పోటీలను నిర్వహించారు. విజేత విద్యార్థులకు ఆ రోజున బహుమతి ప్రదానం జరుగుతుందని పేర్కొన్నారు. చదువులో అధిక మార్కులు సాధించిన వారికి, ఉన్నత స్థాయిలో స్థిరపడిన పూర్వపు విద్యార్థులకు, కళాశాలలో నిర్వహించిన వివిధ బహుళ జాతి కంపెనీలలో ప్రాంగణ నియామకాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అతిథుల చేతులమీదుగా సత్కార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రముఖ గాయని, సాహితీ చాగంటిచే లైవ్ ప్రదర్శనతో పాటు ప్రముఖ రాక్ బ్యాండ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంట్ పనులు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : హైడ్రో పవర్ ప్లాంట్ పనులు వెంటనే నిలిపివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు బల్లిపురం నుంచి విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తి వరకు కొత్తగా చేపట్టనున్న హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను శనివారం సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ బడా కార్పొరేట్ సంస్థ అదాని గ్రూప్ స్థాపించబోయే ఈ పవర్ ప్లాంట్ వలన శారదా నది మీద నిర్మించిన రైవాడ డ్యాం పూర్తిగా ఎడారిగా మారిపోతుందని, అనేక గిరిజన గ్రామాలు ముంపుకు గురవుతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు పనులు వెంటనే నిలిపివేయకపోతే జన సమీకరణ చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు వేమల కన్నబాబు, గొర్లె దేవుడు బాబు, మండల కార్యదర్శి గరికిన రాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపురాజు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి- మునగపాక : మండల కేంద్రం మునగపాకలో శనివారం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గౌరీ పరమేశ్వరులను దర్శించుకోవడానికి ఉదయం నుండి భక్తులు పోటెత్తారు. మొక్కులు తీర్చుకొని కానుకలను సమర్పించుకున్నారు. ఎలమంచిలి శాసనసభ్యులు యువి రమణ మూర్తి రాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు ఆహ్వానించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి మళ్ల జయలక్ష్మి, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపిటిసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్‌రావు, సచివాలయ కన్వీనర్ పొలిమేర గణేష్, పెంటకోట ఉమేష్, వెలగ శ్రీనివాసరావు, బూడిద శ్రీనివాసరావు, పెంటకోట వెంకట్ పాల్గొన్నారు

తహశీల్దారు హత్యపై నల్లబ్యాడ్జీలతో నిరసన



అనకాపల్లి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి- అనకాపల్లి

విశాఖ రూరల్ తహశీల్దారు సనపల రమణయ్య దారుణ హత్యకు నిరసనగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. రమణయ్య మృతికి సంతాపం ప్రకటిస్తూ మౌనం పాటించారు. ఆయన తమతో కలిసి పనిచేసిన రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ బి దయానిధి, ఎవో ఎ రాజేశ్వరరావు, మినిస్ట్రీ రియల్ సెక్షన్ ఎంఎ శ్రీనివాసరావు, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ బి సత్యనారాయణ, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు మురళి బాబు, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, డిటిలు, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : విశాఖ రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్యపై బుచ్చయ్యపేటలో తహశీల్దార్ శ్రీకాంత్, డిటి అరుణ్ చంద్ర ఆధ్వర్యాన రెవెన్యూ సిబ్బంది శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం రమణయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

భీమునిపట్నం : తహసీల్దార్ సనపల రమణయ్యను హత్య చేయడాన్ని ఖండిస్తూ స్థానిక ఆర్‌డిఒ, తహసీల్దార్ కార్యాలయాల ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి ఆయా కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు.

విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ భూములకు రక్షణగా ఉంటున్న రెవెన్యూ ఉద్యోగులకు, అధికారులకు రక్షణ లేకుండా పోవడం బాధాకరమని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు సత్తి నాగేశ్వరరెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. తహశీల్దార్ రమణయ్య మృతదేహానికి ఆయన కెజిహెచ్ మార్చురీ వద్ద అసోసియేషన్ సభ్యులతో కలిసి నివాళ్లర్పించారు. రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జాయింట్ కలెక్టర్‌కు, సిపికి వినతిపత్రాలు అందజేశారు. హత్యకు కారకులైన నిందితులను వెంటనే పట్టుకోవాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి నిందితులను ఆరు మాసాల్లోగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎ.త్రినాథరావు, సిహెచ్.వి.రమేష్ పాల్గొన్నారు.



విశాఖ కలెక్టరేట్ వద్ద...

కొండకర్లలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల పంచాయితీ పరిధిలో కొండ గ్రావెల్ శుక్రవారం రాత్రి అక్రమంగా తవ్వకాలు చేసి తరలించారు. సుమారు 400 ట్రాక్టర్లు తరలించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కంఠం రెడ్డి శ్యామల రాజు, గుడివాడ జయ్ కుమార్, కారుకొండ రమేష్, చొప్ప సన్యాసిరావు, దాసరి నర్సింగరావు, బొద్దపు సుధా, చొప్ప ప్రసాద్, కే అప్పలరాజు, దాసరి ఆదినారాయణ, కే రమణ తదితరులు గ్రావెల్ తవ్వకాల ప్రదేశాన్ని సందర్శించి నినాదాలు చేశారు, వెంటనే గ్రావెల్ తవ్వకం దారులపై చర్యలు చేపట్టాలని కోరారు.



అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేసిన ప్రాంతం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పక్కన పెట్టిన జగన్

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు టిడిపి ప్రభుత్వం రూ.1650 కోట్లు కేటాయిస్తే, జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టును పక్కన పెట్టిందని, చరిత్రలో రైతు ద్రోహిగా జగన్ మిగిలిపోయాడని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఈనెల 5న గొండుపాలెం గ్రామంలో జరుగు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు రా కదిలిరా బహిరంగ సభ ఏర్పాట్లును శనివారం టిడిపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బండారు విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ఇద్దరు మంత్రులు, ఒక ప్రభుత్వ విప్ ఉండి కూడా సాగునీటి ప్రాజెక్టులకు నయా పైసా కూడా తేలేదన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

మాడుగులలో టిడిపి విజయం ఖాయం

దేవరాపల్లి : మాడుగుల నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో టిడిపి ఖాయమని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, నియోజకవర్గం పరిశీలకులు కర్రోతి నరసింగరావు అన్నారు. ఈనెల 5న కె.కోటపాడు మండలం, గొండు పాలెంలో జరుగు రా.. కదలి రా బహిరంగ సభను విజయవంతం చేయాలని చేయాలని కోరుతూ మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో శనివారం మండల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మాడుగులలో గెలుపే లక్ష్యంగా కలిసి పని చేస్తామని నియోజకవర్గ ఇన్చార్జి పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు చెప్పడంతో పార్టీ శ్రేణుల్లో నూతనుత్సాహం నెలకొంది. సమావేశంలో టిడిపి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరఖాన సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, బండారు రామారావు, చల్లా నానాజీ, పెద్దాడ వెంకటరమణ, సోమిరెడ్డి గోవింద, కర్రీ నాయుడు, పూడి సత్య రావు, కొమర బాబురావు, చింతా సాంబమూర్తి, గుల్లిపల్లి అర్జునరావు పాల్గొన్నారు.

6న ఆసరా సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- కశింకోట : కశింకోటలో ఈ నెల 6న జరుగు ఆసరా సదస్సును జయప్రదం చేయాలని జెడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు అన్నారు. స్థానిక మండల పరషత్ కార్యలయంలో శనివారం విఓఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు జగన్ ఇచ్చిన హామీ మేరకు నాలుగో విడత ఆసరా సొమ్ము వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉగ్గినిపాలెము సర్పంచ్ కలగ గున్నయ్య నాయడు, ఎంపిడిఓ శేషు బాబు, ఎంఎంఎస్ ఏపిఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అపరాల సాగులో తెగుళ్లపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : అపరాల సాగులో తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొండంపూడి కేవీకే శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, బాబు, సౌజన్య రైతులకు సూచించారు. మండలంలోని వేచలం గ్రామంలో నువ్వులు పంటను మండల వ్యవసాయ అధికారి ఎల్వై.కాంతమ్మ ఆధ్వర్యాన శనివారం వారు పొలాలను పరిశీలించారు. వైఎల్ఎం - 66 అనే రకంలో ఆకులు మీద మచ్చలు నివారణకు క్యాబేందాజిమ్, మంకజబ్ మందును 2 గ్రాములు 1 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. 1 ఎకరానికి 400 గ్రాముల మందును 200 లీటర్ల నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కలు పూత దశలో ఉన్నప్పుడు మొవ్వ ఆకులు ముడత పడి చెట్టు ఏదగకుండా చనిపోతుందని, వీటి నివారణకు ఆస్టెట్ 1.5 గ్రాము మందు 1 లీటరు నీటికి చొప్పున 1 ఎకరానికి 300 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.

'బాబు ష్యూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 81వ డివిజన్, గవరపాలెంలోని గౌరీ సంఘం ప్రాంతాలలో భవిష్యత్తుకు గ్యారెంటీ- బాబు షూరిటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, డివివి అప్పారావు, బిఎస్ఎంకె జోగినాయుడు, పోలారపు త్రినాథ్, పొలిమేర నాయుడు, రామోజీ సురేశ్, వానపల్లి కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలపై ధర్నా



పరవాడలో వినతిపత్రం ఇస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ

మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సిహెచ్ దేవుడమ్మ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు ఎన్నికల్లో జగన్మోహన్రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రూ.10వేలు వేతనం అమలు చేయాలని, కార్మికులకు యూనిఫారం ఇవ్వాలని, ప్రతినెల వేతనాలు చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్లో జరుగు ధర్నాకు జిల్లాలో ఉన్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పిట్ల మాణిక్యం, ఈశ్వరమ్మ, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మిడ్డేమీల్స్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో ఎంఈఒ-2 బిఎస్ఎన్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిడ్ డే మీల్ వర్కర్లకు మెనూ చార్జి 20 రూపాయలు పెంచాలని, ప్రభుత్వం గ్యాస్ను సప్లై చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఎస్ గౌరీ, వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్

విశ్వకర్మ పథకంతో చేతివృత్తుల వారికి మేలు

జిల్లా పరిశ్రమల అధికారి జిఎం శ్రీధర్

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం విశ్వకర్మ పథకం చేతివృత్తుల కళాకారులకు వరం లాంటిదని జిల్లా పరిశ్రమల అధికారి జిఎం శ్రీధర్ తెలిపారు. స్థానిక వివి.రమణ రైతు భారతి కేంద్రంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాంప్రదాయ కళాకారులకు ఆర్థిక చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. ఐదు నుండి ఏడు రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. డిజిటల్ సేవ కార్డుతో ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చని, దానికి జిల్లా అమలు కమిటీ ఆమోదముద్ర వేస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని 18 గుర్తించబడిన సాంప్రదాయ వ్యాపారాలలో ఉన్న కళాకారులు, అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. డిఎల్డివో మంజులవాణి మాట్లాడుతూ వాలంటీర్లు, మహిళా సంఘాల ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎమ్ఎస్ఎంఇ కోఆర్డినేటర్ ఏడి ఏ శ్రీనివాసరావు విశ్వకర్మ పథకం ఉద్దేశాలు విధి విధానాలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శచీదేవి, డిపిఓ శిరీష రాణి లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు, ఏటి డబ్ల్యు ఓ నాగ శిరీష, డొమైన్ నిపుణులు నాగేశ్వరరావు పరమేశ్వరరావు విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు గంగారాం పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు సి ఎస్ సి హెడ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పలు భవనాలు, సిసి రోడ్లు ప్రారంభం



భవనాలను ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

మండలంలో వివిధ గ్రామాల్లో పలు భవనాలను శనివారం అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. కన్నంపాలెం, చాకిపల్లి, జన్నవరం, నరసయ్యపేట, చోడవరం టౌన్, ఎం.కొత్తపల్లి, నంబారువానిపాలెం, ముద్దుర్తి, గంధవరం, వెంకన్నపాలెం, అడ్డూరు, అంబేరుపురం తదితర గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు, సామాజిక భవనాలు, సిసి రోడ్లు, పాఠశాల ప్రహరీల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, డీసీఎంఎస్ చైర్మన్ పల్ల నర్సింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైకాపా మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, పలువురు అధికారులు, ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలో రూ.2.09 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం ప్రారంభించారు. మల్లు నాయుడు పాలెం, బోదువలస, అంతకాపల్లి, వంగలి, ఆరిపాక గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్ల భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామనాయుడు, వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద, సబ్బవరపు నారాయణ మూర్తి, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, బోను దేముడమ్మ, గంగు నాయుడు, నేబర్తి శ్రీనివాసరావు, గవర తులసిరాజు, జిల్లా వీఆర్వోల సంఘ అధ్యక్షులు ఎస్‌టి.రామకాసు, పలువురు సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



మాట్లాడుతున్న సిఐ వినోద్‌బాబు

వైన్ షాపుల్లో దొంగతనాలపై అప్రమత్తత

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట మండలంలోని ప్రభుత్వ వైన్ షాపుల్లో దొంగతనాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిఐ వినోద్‌బాబు ఆదేశించారు. వైన్ షాపుల సూపర్ వైజర్లు, వాచ్‌మెన్‌లతో సిఐ వినోద్ బాబు పోలీస్ స్టేషన్లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొంగతనాలు జరగకుండా సెక్యూరిటీ గార్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పాడి రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని మర్రిపాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యాన పాడి రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డెయిరీ రీజనల్ మేనేజర్ పి నాగ అప్పారావు మాట్లాడుతూ హెరిటేజ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు పథకాలను ఆయన వివరించారు. అనంతరం రైతులకు మినరల్ మిక్సర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము ఎస్ శంకర్రావు ఎస్ సంజీవరావు దొరబాబు రాము పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -కశింకోట : కశింకోటలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద విశాఖ శంకర్ ఫౌండేషన్ సహకారంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. కంటి వైద్యులు ఊర్వశి సింగ్, సమృద్ధి దేశముఖ్ 91 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 16 మంది కళ్ళ జోళ్లకు, 14 కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, కే గోపాలరావు, నంబా రమణ, కర్ణం సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు కావాలి

ప్రజాశక్తి- కశింకోట : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల తహశీల్దార్ ఎల్.మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు కశింకోట మండలంలో 55,707 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 26,786 మంది, స్త్రీలు 28,920 మంది కాగా, ఒకరు ఇతరులని పేర్కొన్నారు. ఎన్నికలకు 71 బూతులు నిర్ణయించామని, సంస్యాత్మక గ్రామాలు గుర్తించి వాటిపై చర్యలు చేపడతామని చెప్పారు. విలేకర్ల సమావేశంలో డిటి సురేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి లక్ష్మీదేవిపేట కళ్యాణ మండపంలో శనివారం 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ ఆధ్వర్యాన 5, 6 సచివాలయాల పరిధిలో టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు, ఇళ్ల తాళాలను శనివారం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ చేతుల మీదగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం అప్పలమయం

-మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మాడుగుల నియోజక వర్గంలో ఈ నెల 5న జరిగే రా కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. శనివారం అయ్యన్న నివాసం వద్ద నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, ఈ సభకు నర్సీపట్నం నియోజకవర్గం నుండి భారీ ఎత్తున తరలి వెళ్లాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకూ సుమారు 11లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి సర్వనాశనం చేశారన్నారు. చేసిన అప్పులకు సంవత్సరానికి 80 వేల కోట్లు వడ్డీ కడుతున్నారన్నారు. మరో 3 నెలల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇంచార్జి రాజాన వీర సూర్యచంద్ర, నియోజకవర్గ పరిశీలకులు ఎంవివి.ప్రసాద్, మురళీకృష్ణరాజు, గొల్లపూడి పెద్దిరాజు, మండల నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్న

చలో అసెంబ్లీని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-యస్.రాయవరం:ఈ నెల 6వ తేదీ నుండి జరుగనున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సర్పంచ్‌ల చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు యేజర్ల వినోద్ రాజు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండలంలో పెదగుమ్ములూరులో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన సర్పంచుల నిధులు తిరిగి వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్లు సర్పంచుల ఆధీనంలోనే పని చేయించాలన్నారు. గతంలో మాదిరిగా గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీ లకు రూ 15000 వేలు, ఎంపీపీ లకు, జడ్పిటిసి లకు రూ 30000 వేలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని సర్పంచ్‌లు రాజకీయాలకతీతంగా ఈనెల 6న అమరావతి అసెంబ్లీ వద్ద జరిగే "చలో అసెంబ్లీ" కార్యక్రమంలో పాల్గొని భాగస్వాములు కావాలని కోరారు.



మాట్లాడుతున్న సూర్యచంద్ర

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర కోరారు. శనివారం నర్సీపట్నంలో పార్టీ రూరల్ అధ్యక్షులు మోపాడ చిరంజీవి అధ్యక్షతన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి విజయానికి కార్యకర్తలు శ్రమించాలన్నారు.వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సామిరెడ్డి కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సేనాపతి నాయుడు, బంగారు నాయుడు, సుబ్బల నాని, పరవాడ లోవరాజు పాల్గొన్నారు.

తాగునీటిని సరఫరా చేయాలి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొంతలం గ్రామానికి గత 10 రోజులుగా తాగునీరు సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన నాయకులు సోమిరెడ్డి బాబ్జి, కేశరపుడి శివాజీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జలజీవన్ మిషన్ పథకంలో కొంతలం గ్రామానికి 42 లక్షలు నిధులు మంజూరు కాగా పైపులైను వేసి కుళాయిల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్తగా బోరు ఏర్పాటు చేసి దాని ద్వారా గతంలో నిర్మించిన ట్యాంకుకు పంప్ చేయడంతో నీరు గ్రామ ప్రజలకు సంపూర్ణంగా అందలేదన్నారు.



పుష్ కాట్స్ అందజేస్తున్న ఛైర్‌పర్సన్

మున్సిపాలిటీలో పారిశుధ్యమే ధ్యేయం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు పుష్ కాట్స్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ మున్సిపాలిటీని పారిశుధ్య రహితంగా తీర్చి దిద్దాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపితోనే దళితుల అభ్యున్నతి

మాజీ ఎమ్మెల్యే అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి :దళితుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్ వద్ద ఆమె స్వగృహం వద్ద శనివారం వివిధ దళిత సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు దళితుల అభ్యున్నతకు ఎంతగానో కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకు వచ్చేందుకు దళితులు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టనున్న సంక్షేమ పథకాలను వివరించారు. హౌసింగ్ లో దళితులకు ప్రత్యేక కాలనీ, ఎస్సీ సబ్ ప్లాన్ పునరుద్ధరణ,పాయకరావుపేటలో అంబేద్కర్ పార్క్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిత

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : బూడి

ప్రజాశక్తి-చీడికాడ:ప్రజల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. శనివరం ఆయన మండలంలోని చీడికాడ, శిరీజాం సచివాలయాలతో పాటు రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న ప్రజలకు పలు రకాలుగా ప్రభుత్వం పథకాలు ప్రవేశ పెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యంపీపీ జయమ్మ, రాజబాబు, నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

తహశీల్దార్‌గా రవిచంద్ర బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రోలుగుంట: మండల తహశీల్దార్‌గా రవిచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన కె.వరహాలు విజయనగరం జిల్లా పార్వతీపురం మన్యంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందు బాటులో ఉంటు రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని తెలిపారు.



తహశీల్దార్‌ను కలిసిన ఎంపిపి

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మురళీ మోహన్‌రావును శనివారం ఎంపిపి రుత్తల సత్యనారాయణ శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని పలు సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాజారావు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న ఎంపిపి, నాయకులు

ట్రాఫిక్ వలయంలో సంత

-భారీగా నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి -హుకుంపేట:మండల కేంద్రంలోని వారపు సంతల్లో ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం వారపు సంతలో ట్రాఫిక్ సమస్యతో గంటల పాటు రహదారి స్తంభించి పోయింది. మొదకొండమ్మ గుడి నుండి కమయ్యా పేట రోడ్డు వరకు ట్రాఫిక్‌తో నిండి పోయింది. జనాలతో సంత కిక్కిరిసి పోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో, రైతులు ఇబ్బందులు పడ్డారు. నిత్యం ట్రాఫిక్ సమస్యతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. పాదచారులు రాకపోకలకు తీవ్రం అవస్థలు పడ్డారు. వారపు సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గిరిజనులు, ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

గృహ హక్కు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో కవగుంట పంచాయితీ శివారు బుడ్డి బంద గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా గృహ హక్కులను పట్టాలను సర్పంచ్ దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు, ఉప సర్పంచ్ రమేష్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా రైతాంగానికి భూములకు హక్కు కల్పిస్తూ పాస్ పుస్తకాలను అందజేస్తుందని తెలిపారు. వీటితో ఇంటిపై మనకు సర్వ హక్కు, భరోసా కలుగుతుం దన్నారు. ఇంటి పన్నుతో పాటు మన ఇంటికి సర్వహక్కులు కల్పిస్తూ ప్రభుత్వం హక్కు పత్రాలను మంజూరు చేయడం ఎంతో శుభ పరిణామన్నారు.



పట్టాలు ఇస్తున్న కన్వీనర్

ఎస్ఐ భీమరాజును కలిసిన నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నర్సీపట్నం రూరల్ ఎస్ఐ భీమరాజును నర్సీపట్నం మండల జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ అధ్యక్షులు మోపాడ చిరంజీవి ఆధ్వర్యంలో వీరంతా ఎస్ఐకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. అనంతరం మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.



సన్మానిస్తున్న అధికారులు

మహాలక్ష్మినాయుడుకు ఘన సన్మానం

ప్రజాశక్తి -రావికమతం:మండలంలోని మేడివాడ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎస్.ఆర్. కే.ఎస్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వివిధ మండలాల భవిత కేంద్రాలలో పని చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు దివ్యాంగుల పిల్లలకు టాబ్స్ ఉపయోగించి ప్రత్యేక విద్య అందించడంపై వృత్యంతర శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష రాష్ట్ర కీ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య విభాగం, పశ్చిమగోదావరి జిల్లా సహిత విద్యా విభాగం అధికారులు సన్మానించారు. దివ్యాంగ పిల్లలకు అందించిన సేవలను గుర్తింపు, కీ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి, శిక్షణను అందించడంపై సత్కరించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కేటాయించిన పోలింగ్ కేంద్రాలను ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసిల్దారు వెంకటరమణ శనివారం సందర్శించారు. చౌడువాడ, గొట్టివాడ, కైలాసపట్నం, పందూరు, తదితర కేంద్రాలను పరిశీలించారు. వృద్ధులకు, వికలాంగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను గ్రామస్తులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉర్ధవరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధే ప్రథమ కర్తవ్యం

-మేయర్ హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:నగరాభివృద్ధే ప్రథమ కర్తవ్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె 3వ జోన్ 23వ వార్డు లోని పలు అభివృద్ధి పనులకు పార్లమెంటు సభ్యులు ఎం.వి.వి.సత్యనారాయణ, 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో విశాఖ సుందర నగరంగా తీర్చిదిద్దడం జరిగిందని, ఇప్పటికే ప్రతి వార్డులలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేశామని తెలిపారు. శనివారం 23వ వార్డు మద్దిలపాలెంలోని చైతన్య నగర్‌లో సుమారు 48.50 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసామన్నారు. ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు వైయస్సార్ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అనంతరం పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గం పరిధిలో ప్రతి వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, దానికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు అంచలంచలుగా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

-యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

ప్రజాశక్తి-కలెక్టరేట్: ప్రముఖ సినీ నటుడు, రాజకీయ నాయకుడు ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వాలని రాజ్యసభ మాజీ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ స్థాపనతో, ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, వెనుకబడిన తరగతుల వారికి, మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన గొప్ప నాయకుడు ఎన్టీ రామారావు అని అన్నారు. కేంద్రంలో అన్ని ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఘనత ఆయనది అన్నారు. తమిళనాడుకు చెందిన మాజీ ముఖ్యమంత్రి ఎం.జి రామచంద్రన్ కు భారతరత్న ప్రధానం చేశారన్నారు. అలాగే ఎన్టీఆర్‌కు ఇవ్వాలన్నారు. ఎల్.కె అద్వానీకి భారతరత్న ఇవ్వడాన్ని ఆయన సమర్థిస్తూ హర్షం వెలిబుచ్చారు. ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న ఇచ్చారని, అదేవిధంగా మాజీ ప్రధాని పి.వి నరసింహారావుకు కూడా భారతరత్న ఇచ్చి గౌరవించాలని కోరారు.

గ్రామాల్లో తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:జల జీవన్ మిషన్‌తో మారుమూల గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడం జరుగుతుందని కంద్రుమ్ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి చెప్పారు. మండలంలోని కంద్రుమ్ పంచాయతీ లాసేరుగూడ, బైలుగూడ గ్రామాల్లో జల జీవన్ మిషన్ పథకం ద్వారా రూ 7.50 లక్షల నిధులతో మంజూరైన సోలార్ గ్రావిటీ పథకాన్ని శనివారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచినీటి సౌకర్యం లేని గ్రామాల్లో సోలార్ గ్రావిటీ పథకం ద్వారా తాగునీటిని కల్పించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

భారత్- ఇంగ్లండ్ మ్యాచ్‌కు...

భారీగా విద్యార్థుల రాక

-నేడు 9 గంటలలోపు వచ్చిన స్టూడెంట్స్‌కే ప్రవేశం

ప్రజాశక్తి -పిఎం.పాలెం : పిఎం.పాలెంలోని ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో జరుగుతున్న భారత్ -ఇంగ్లాండ్ రెండో టెస్టు మ్యాచ్‌ను తిలకించేందుకు విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించడంతో ఆదివారం ఈ సంఖ్య మరింత పెరిగేఅవకాశముంది. కొన్ని పాఠశాలలకు చెందిన యాజమాన్యాలు మొత్తం విద్యార్థులను శనివారం మ్యాచ్ కోసం తీసుకొచ్చాయి.

విద్యార్థులకు 9 గంటల వరకే అనుమతి..

స్టేడియం వద్దకు ఆదివారం ఉదయం 9 గంటలలోపు వచ్చిన వారికి మాత్రమే ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. రోజుకు రెండు వేల మంది విద్యార్థులకు మాత్రమే ఉచిత ప్రవేశం కల్పించాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ముందుగా నిర్ణయించినప్పటికీ శనివారం దాదాపు మూడు వేల మందిని అనుమతించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ముందస్తు చర్యగా రెండు గేట్ల ద్వారా స్టేడియంలోకి పంపేలా చర్యలు తీసుకుంటున్నారు.

జైశ్వాల్ మెరుపు డబుల్

జైశ్వాల్ డబుల్ సెంచరీతో క్రీడా మైదానం అభిమానుల కేరింతలతో హోరెత్తింది. తరువాత బ్యాటింగ్ బరిలోకి దిగిన ఇంగ్లాండ్ జట్టును భారత్ బౌలర్లు 253 పరుగులకే కట్టడి చేయడంతో అభిమానులు మ్యాచ్‌ను చూసేందుకు మధ్యాహ్నం వరకు స్టేడియం లైన్లో క్యూ కట్టారు.

భారత్ రెండో ఇన్నింగ్స్‌ను శనివారం ప్రారంభించింది. 28/0 స్కోరుతో ఆట ముగిసింది. అంతకుముందు ఇంగ్లాండ్‌ను 253 పరుగులకే ఆలౌట్ చేసిన టీమ్ ఇండియా.. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 143 పరుగులతో కలిపి మొత్తం లీడ్ 171 రన్స్‌కు చేరింది.



స్టేడియంలో సందడి చేస్తున్న విద్యార్థులు



వికెట్ తీసిన ఆనందంలో భారత జట్టు



బ్యాటింగ్ ఆడుతున్న రోహిత్ శర్మ



ఇండియా అభిమానుల సందడి

మందకొడిగా జగనన్న గృహాల రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటరమణ

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గృహ లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పిస్తూ చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండల వ్యాప్తంగా మందకుడిగానే సాగుతోంది. మండల వ్యాప్తంగా 32 లేఔట్లు ఏర్పాటుచేయగా 940 లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చేందుకు సిద్ధం చేశారు. దీనిలో 512 మంది మాత్రమే నిర్మాణం చేపట్టి వివిధ దశల్లో ఉన్నవారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ అధికారులు చేపడుతున్నారు. పలు గ్రామాల్లో నివాసయోగ్యం కానీ లేఔట్‌ల కారణంగా లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్ట లేదు. శుక్రవారం, శనివారాలు కలిపి కేవలం 67 మంది లబ్ధిదారులకు మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు తహసిల్దారు వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయాల పరిధిలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతానికి చర్యలు

-ఎంపిడిఓ భానోజీరావు



ప్రజాశక్తి -కొత్తకోట:జగనన్న గృహ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టామని రావికమతం ఎంపిడిఓ హెచ్. భానోజీరావు తెలిపారు. శనివారం కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో జగనన్న కాలనీ ఇల్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వడమే కాకుండా లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా కొత్తకోటలో సుమారు 197 మంది లబ్ధిదారులకు గాను 174 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పనులు చేపట్టారని పేర్కొన్నారు. ఆన్ లైన్ లో సాంకేతిక లోపంతో సర్వర్ పని చేయక సమయం ఎక్కువ పడుతోందన్నారు. త్వరలో జిల్లా అధికారుల సూచనల మేరకు మండల వ్యాప్తంగా జగనన్న కాలనీల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని ఎంపిడిఓ వివరించారు. ఈ కార్యక్రమం లో కొత్తకోట పంచాయితీ కార్యదర్శి లక్ష్మి కుమార్ తదితరులు పాల్గొన్నారు.